# పరమార్థం

వర్షం...!

పట్టిన పట్టు విడిచిపెట్టకుండా రెండు రోజుల్నించీ – ఆకాశం చిల్లులు పడినట్టు కురుస్తోంది వర్షం..

దానికి తోడు విపరీతమైన చలిగాలి!...

మహానగరానికి మధ్యలోనే వున్నా – హోరున కురుస్తున్న ఆ వర్షంలో ఎవరికీ పట్టని ఏకాకిలా, ఏ ఒక్కరూ పట్టించుకోని కుష్ఠురోగిలా వికృతంగా కనిపిస్తోంది. ఆ మురికివాడ...

వర్షం వల్ల కరెంటు పోయింది. అక్కడి వీధిలోని రెండు దీపాలూ ఆరిపోయాయి. అంతా చీకటిగా వుంది... గుడిసెల్లో మినుకు మినుకుమంటున్న గుడ్డి దీపాల వెలుతురు – వీధి చీకటిని జయించలేకపోతోంది.

ఆ వాడంతా నిద్రమత్తులోకి జారుకుంటోంది.

యాదగిరికి నిద్ర రావటం లేదు...!

దుఃఖం మాత్రం పెల్లుబికి వస్తోంది...

కుక్కిమంచంలో, లేచి కూర్చుని బీడీ వెలిగించాడు. పక్కనేవున్న చింకి చాపమీద సుబ్బులు పడుకుని ఉంది. నిద్రపోతోందో, మెలకువగానే ఉందో తెలియటం లేదు.

ఏడాదైనా నిండని బుజ్జిగాడు ఆమె గుండెల్ని హత్తుకుని నిద్రపోతున్నాడు. వాడికి ఏ బాధా తెలియదు.' ఎలాంటి బాదరబందీ లేదు...! రేపెపుడో తనువేసే తప్పటడుగులకు నడక నేర్పి, వచ్చీరాని తన ముద్దుముద్దు మాటలకు భాషనేర్పి, కంటికి రెప్పలా కాపాడుతూ పెంచి పెద్ద చేయాల్సిన కన్నతల్లి – తనకు జన్మనిచ్చిన ఆర్నెల్లకే అన్యాయం చేసి వెళ్లిపోయిందని ఆ పసి మనసుకి అసలు తెలియదు. అందుకే హాయిగా ఆదమరచి నిద్దరోతున్నాడు!!

వర్షం ఎక్కువైంది...

వడగళ్ళ వంటి ఆలోచనలు యాదగిరి అంతరంగంలో సుడులు తిరుగుతున్నాయి.

ఆ రోజున కూడా ఇలాగే కురిసింది వర్షం!

అప్పటినించీ అతనికి వర్షమంటే వల్ల మాలిన భయం పట్టుకుంది. వర్షం కురిసినప్పుడల్లా – ఆ రాత్రే గుర్తుకొచ్చి అతన్ని పిచ్చివాణ్ణి చేస్తుంది.

ఆ జ్ఞాపకాలనించి పారిపోవాలనిపిస్తుంది!

అలా పారిపోవాలంటే ఒక్కటే మార్గం అతనికి కనిపిస్తుంది! ఆమార్గం అతన్ని కల్లుదుకాణానికి లాక్కుపోతుంది.

యాదగిరి చటుక్కున మంచం దిగి - ప్లాస్టిక్ గుడ్డ బుజాలమీదుగా కప్పుకుని - కాళ్ళకు చెప్పులు తొడుక్కున్నాడు.

"ఎక్కడికి మావా?" - మెలకువగానే ఉన్న సుబ్బులు అడిగింది.

"అలా పోయొస్తా... తలుపేసుకో... బాగా సలిగా వుంది... బుజ్జిగాడికి దుప్పటి కప్పు!" - అంటూ బయటకు నడిచాడు.

చీకటినీ వర్షాన్నీ దూసుకుని వడివడిగా అడుగులేస్తూ - పదినిమిషాల్లో రైలుకట్ట పక్కనే వున్న కల్లు దుకాణానికి చేరుకున్నాడు.

అక్కడంతా సందడిగా వుంది!

కొందరి పలకరింపులు... మరికొందరి కలవరింతలు... ఇంకొందరి నవ్వులు...! కొందరు తాగినవాళ్లు...మరికొందరు తాగుతున్న వాళ్లు...ఇంకొందరు తాగివాగుతున్న వాళ్లు..!!

అదంతా ఓ వింత ప్రపంచంలా వుంది.

ఆ ప్రపంచలో అడుగుపెట్టిన యాదగిరి కొంటర్లో పది రూపాయల నోటు పెట్టి కల్లు సీసా తీసుకున్నాడు.

"ఏంట్రోయ్ యాద్గిరీ - ఈ యాలప్పుడు కొత్త పెళ్లాం పక్కలో ఎచ్చగా తొంగోకుండా, ఈడకొచ్చావేంటి?" - పక్కనే బల్లమీద కూర్చుని సీసాఎత్తి తాగుతున్న సీతయ్య యాదగిరిని పలకరించాడు.

"ఓరున వర్సం కురుస్తావుంటే - ఓ సుక్కేసుకుని - అప్పుడు సుక్కపక్కన తొంగోవాల!... అయినా పెళ్లీపెడాకులూ లేనోడివి... నీకేం తెలుస్తాదిరా?" - సీతయ్యకు ఎదురుగానే కూర్చున్న ఎల్లయ్యకు మందు తలకెక్కటంవల్ల మాటలు ముద్దముద్దగా వస్తున్నాయి.

వాళ్ళ మాటలు విన్న యాదగిరికి చిర్రెత్తుకొచ్చింది. అయినా నిగ్రహించుకుని - దూరంగా వెళ్ళి - ఓ మూల ఖాళీగావున్న బెంచీమీద కూర్చున్నాడు.

"తెరి ప్యారీ ప్యారీ సూరత్‌కో
కిసీకీ నజర్ నాలగే"-

దూరంగా కౌంటర్లో వున్న ట్రాన్సిస్టర్‌లోంచి మహమ్మద్ రఫీ పాట వినిపిస్తోంది. కానీ ఆ పాటా, అందులోని భావం యాదగిరి బుర్రకెక్కటం లేదు. అతని కళ్ళముందు మల్లిక రూపమే అస్పష్టంగా కదుల్తోంది.

మల్లిక తనకు శాశ్వతంగా దూరమై ఆరు నెలలు దాటిపోయినా, ఆమె తాలూకు జ్ఞాపకాలు తనను వీడిపోవటం లేదు...

"ఇపుడు నీకేమంత వయసైపోయిందనీ? అసలు నీ ఈడువాళ్లు చాలామంది ఇంకా పెళ్లే చేసుకోలేదు తెలుసా?"–అంటూ తనవాళ్లంతా పోరుపెట్టి బలవంతంగా తన చేత సుబ్బులు మెడలో తాళి కట్టించారు.

సుబ్బులు కూడా అందంగానే వుంటుంది. కానీ మల్లికను ప్రేమించినంత మనస్ఫూర్తిగా ఆమెను ప్రేమించలేకపోతున్నాడు. ముఖ్యంగా బుజ్జిగాణ్ణి చూసినప్పుడల్లా – వాడికేదో అన్యాయం జరిగిపోయిందన్న దిగులు యాదగిరిని కుదిపేస్తోంది.

"రేపెప్పుడో తనవల్ల సుబ్బులు కడుపున కూడా ఓ కాయకాస్తుంది. అప్పుడు బుజ్జికి 'తల్లిప్రేమ' పూర్తిగా కరువైపోతుందేమో! ఈ ఆలోచనే అతన్ని పట్టిపీడిస్తోంది.

ఇప్పుడు కూడా మళ్లీ 'బుజ్జిగాడు' కళ్ళ ముందు కదిలి – యాదగిరికి కన్నీరు పెల్లుబికి వచ్చింది. సీసాలోవున్న కల్లు రెండు గుక్కల్లో తాగేసి – మరో సీసా తెచ్చుకున్నాడు.

వర్షం ఇంకా తగ్గలేదు!

ఆ రోజు...

ఆ రోజున కూడా ఇలాగే హోరున కురిసింది వర్షం. ఆకాశానికి చిల్లులు పడినట్లు కురిసింది.

అప్పుడే... ఆ వర్షం కురిసిన రాత్రే 'కల్తీసారా' కోరల్లోంచి బయటపడలేక – తనవైపు నిస్సహాయంగా చూస్తూ, బుజ్జిగాడి చేతుల్ని తన చేతిలోపెట్టి – మల్లిక తుదిశ్వాస విడిచింది.

అసలు, మల్లిక తన తలపుల మలుపుల్లో నిలబడితే – యాదగిరి కళ్లు అప్రయత్నంగానే వర్షిస్తాయి...

ఒకప్పుడు ఆనందంతో... కానీ ఇప్పుడు మాత్రం ఆవేదనతో...!

మల్లికను యాదగిరి అంతగా ప్రేమించాడు... మరింతగా ఆరాధించాడు... ఆమె తనకు స్వయానా అక్కకూతురే! చిన్నతనం నించే వాళ్ళిద్దరూ పనికి వెళ్లేవారు. పొలంలో పనిచేసేటప్పుడు – గట్టు వెంబడే బారులు తీర్చి నిలబడే తాడిచెట్లు – పక్కనే వున్న చెరువు గట్లూ ఎంతో అందంగా కనిపిస్తూ, వలపులు వీస్తూ, సంకెళ్లు వేస్తూ వాళ్ళను కవ్వించేవి...

అల్లరి చేసే వయసు వాళ్లది. అప్పట్లో పరస్పరం ఆశలు రేపే మనసు వాళ్ళది.

వయసుతోపాటే మనసు పెరిగింది. పెరిగిన మనసు ప్రేమకు అర్థాలు నేర్పింది. అసలు మల్లిక పుట్టినప్పుడే యాదగిరికోసం పుట్టిందన్నారు. 'నిజంగా అందుకే కాబోలు' అనుకునేది మల్లిక వయసు పెరిగినప్పుడూ – మనసు ఎదిగినప్పుడూ...

ఓ రోజు ఇద్దరూ కలిసి-టౌన్లో సినిమాకు వెళ్లారు... పక్కపక్కనే కూర్చుని సినిమా చూశారు. సినిమాలోని హీరో హీరోయిన్లు తామే అయినట్టుగా ఊహల్లో విహరించారు. ఆట వదిలేసరికి పదిగంటలై పోయింది.

పట్నం నించి ఇద్దరూ ఇంటికి తిరిగివస్తున్నారు - అప్పుడప్పుడే ఆకాశంలో మేఘాలు పేరుకుని - అవి కారుమబ్బులవుతున్నాయి.

చీకటి చిక్కగా వున్నా - తోట పాతదే కావటం వల్ల ప్రేమికుల అడుగులు వేగంగానే పడుతున్నాయి.

మామిడి తోట... ఎవ్వరూ లేనిచోట...!

చెరువు గట్టు... చీకటి వాళ్ల చుట్టూ...!

తమ ఊరి పొలిమేరల్లో వున్న అమ్మవారి గుడిదగ్గరకు వచ్చేశారు. ఇంకో పదినిమిషాలు నడిస్తే ఇంటికి చేరిపోవచ్చు...

కానీ...

అంతవరకూ ఉగ్గబట్టుకుని ఉన్న వర్షం ఉరుముతూ ఒక్కసారిగా విరుచుకుపడింది. వాళ్లిద్దరూ ఒక్కపరుగున అమ్మవారి గుడిలోకి వెళ్లారు. గాలి ఎంతగా వీస్తున్నా గర్భగుడిలో అమ్మవారి విగ్రహం ముందున్న జ్యోతి మాత్రం నిగ్రహంతో వెలుగుతోంది.

గుడిలో వెచ్చగా ఉంది. గుడి వెలుపల చీకటి 'చిచ్చు'గా ఉంది. వాళ్ళ నులివెచ్చని గుండెల్లో పేరుకుంటున్న పిచ్చికోరిక నిగ్రహాన్ని కోల్పోయింది. వాళ్ళ మనసులు పెనవేసుకున్నాయి.

వానవెలసింతరవాత... వాళ్ళ కోరిక తడిసింతరవాత - ఇద్దరూ ఇంటికి చేరుకున్నారు. అలస్యానికి ఇంట్లోవాళ్లు కారణమడిగితే- తప్పు చేసిన వాళ్లలా తలలు వంచుకున్నారు. ఇంకా ఆలస్యం చేస్తే ఆ పెళ్లికాస్తా వాళ్లే ఏ గుళ్లోనో గుట్టుగా చేసేసుకుంటారని పెద్దవాళ్లు భయపడ్డారు.

అందుకే...

వాళ్ళిద్దరికీ ఘనంగా పెళ్లిచేసేసి - ఓ గదిలోకి తోసేశారు!

"ఏంట్రా యాదగిరీ... కల్లుసీసా కళ్ళ ముందెట్టుకుని కలలుకంటున్నావా?" - అటుగా వచ్చిన నూకరాజు, భుజం మీద చేయివేసి హెచ్చరించటంతో యాదగిరి ఆలోచనలు తెగిపోయాయి.

నూకరాజువైపు చిరాగ్గా చూశాడు.

ఆ చూపుల్లో కోపం... తన కమ్మని కలల్ని కరగించటం అతను చేసినపాపం...!

గబగబా గ్లాసు ఖాళీచేసి కల్లు దుకాణం లోంచి బయటకు వచ్చాడు యాదగిరి.

ఇంకా వర్షం తగ్గలేదు.

ఇప్పుడతని కళ్ళను మత్తు ఆవరిస్తోంది.

అయినా చిత్తాన్ని స్వాధీనంలోనే వుంచుకుని - వేగంగా నడుస్తూ ఇంటికి చేరుకున్నాడు.

తలుపు లోపల గడియపెట్టిలేదు. చేత్తో తోసేసరికి తెరుచుకుంది.

సుబ్బులు ఇంకా నిద్రపోలేదు.

"వచ్చేవా!... ఇంతరాత్రివేళ అసలీ వర్సంలో ఎక్కడికెళ్లేవ్?" - యాదగిరిని చేరుకుంటూ అడిగిందామె.

"ఈ సీకటికి సిక్కకుండా, వర్సానికి దూరంగా ఎల్లిపోవాలనుకున్నాను... కానీ ఇది నన్ను వెంటాడుతూనే వుంది. అందుకే ఎక్కడికీ ఎల్లలేకపోయానే సుబ్బీ..." ఉసూరుమంటూ మంచం మీద కూలబడి చెప్పాడు యాదగిరి.

"అదిసరే... నువ్వింకా నిద్రపోలేదా?... ఎక్కువ సేపు మెలకువగా వుంటే నీ ఆరోగ్యం సెడిపోదూ..." రెండు క్షణాల తర్వాత గూట్లోంచి బీడీతీసి వెలిగించుకుంటూ అడిగాడు.

"పర్వాలేదులే!... అయినా రోజూ పీకల్దాకా తాగేమడిసి ఆరోగ్యం సెడిపోదుకానీ - ఓ రోజు నిద్రలేకపోయినంత మాత్రాన ఆ మడిసి ఆరోగ్యం సెడిపోద్దా?" -

సుబ్బులు మాటల్లోని వ్యంగ్యం అతని మనసుకి సూటిగా తగిలింది... నిజానికి - ఆ రోజునించీ, అంటే మల్లిక చనిపోయిన నాటినుంచీ అసలింక తాగకూడదనే నిర్ధారణ చేసుకున్నాడు... కానీ సుబ్బుల్నీ కట్టుకున్నాక - అటు మల్లికను మర్చిపోలేకా - ఇటు సుబ్బుల్నీ సుఖపెట్టలేకా - మానసికంగా నలిగిపోతూ, ఆ బాధను మర్చిపోవటానికి మత్తును ఆశ్రయిస్తున్నాడు.

"ఇంతకు ముందే బుజ్జిగాడు నిద్దర్లో ఉలిక్కిపడి లేచాడు. గుక్కపట్టి ఒకటే ఏడుపు... ఎలాగో నిద్రపుచ్చాను!" - అంతలోనే చెప్పింది సుబ్బులు.

"బహుశా వాడిక్కూడా వాళ్ళమ్మ కలలోకి వచ్చిందేమో!" - అనుకున్నాడు యాదగిరి.

"వీడి సిట్టిసిట్టి అరసేతులు సూశావా మావా?... గులాబీపువ్వు రేకుల్లా ఎంత అందంగా వున్నాయో... నిద్దట్లో నవ్వుతూంటే బుగ్గలు బలేసొట్టలు పడతాయిలే!" - నిద్రపోతున్న బుజ్జిగాణ్ణి తన గుండెలకు మరింత దగ్గరగా హత్తుకుంటూ చెప్పింది.

"అవునే! వాడివన్నీ మల్లిక పోలికలే!" - అన్నాడు యాదగిరి.

అలా అంటూంటే మళ్ళీ అతని కళ్లల్లోకి కన్నీరు ఉబికివచ్చింది. వాటిని దాచుకునే ప్రయత్నం చేస్తూ - మంచం మీద మరోవైపు తిరిగి పడుకున్నాడు.

వీధిలో ఇంకా వర్షం కురుస్తూనే వుంది...

దూరంగా ఎక్కడో కుక్కపిల్లలు వికృతంగా అరుస్తున్నాయి!

“బహుశా వాటిని చేరదీసి పెంచిన యజమాని కూడా - వాటిని ఒంటరిగా వదిలేసి - ఆ రాత్రి, కల్తీసారా కాటుకి ఆఖరి శ్వాసను తీసుకుని వుండాలి!” అనుకున్నాడు యాదగిరి.

ఆ రాత్రి...

ఆ సంఘటన...

మల్లిక తనకు శాశ్వతంగా దూరమైన దుస్సంఘటన...!?

అర్ధరాత్రి దాటింతరవాత - తనకు హఠాత్తుగా మెలకువ వచ్చింది. కళ్లు తెరచి చూసేసరికి - నోరు తెరచి ఎగశ్వాస తీసుకుంటున్న మల్లిక కనిపించింది... ఉండి ఉండి ఆమెకు ఎక్కిళ్లు కూడా వస్తున్నాయి.

“మల్లీ!” అంటూ పిచ్చివాడిలా అరచి- ఆమెను అటూ ఇటూ కదిపాడు. ఆమెలో రవంత చలనం కనిపించింది.

అంతలోనే - తన శరీరం గాలిలో తేలిపోతున్నట్టుగా అనిపించింది యాదగిరికి. బలవంతాన కాళ్లు నేలపై అన్చి - ఊయలలోకి చూశాడు. అందులో బుజ్జిగాడు నిద్రపోతూ కనిపించాడు...

క్షణం ఆలస్యం చేయకుండా - వాణ్ణి భుజానవేసుకుని, మల్లికను, లేవదీసి, నెమ్మదిగా నడిపించుకుంటూ బయటకు వచ్చాడు... అంతరాత్రి సమయంలో కూడా ఆ రోడ్డు జనసమ్మర్థంగా వుంది... వాళ్ళ హాహాకారాలతో ఆ పరిసరాలు మారు మోగిపోతున్నాయి. వాళ్ళలో చాలామంది తనతోబాటు ఊరి చివర కొండల్ని పగలగొట్టి రాళ్లు తయారు చేసేవాళ్లే... ఆ రోజు సాయంత్రం పని పూర్తిగాగానే - కూలి డబ్బులు చేతిలో పడితే - రోజూలాగే కల్లుదుకాణం దగ్గరకెళ్లి - పీకల్దాకా తాగారు... వద్దు వద్దంటే వినకుండా ఆ రోజు మల్లికతో కూడా తాగించాడు...

బహుశా వాళ్లు తాగిన సారా కల్తీదై వుండాలి. అందుకే మల్లిక పరిస్థితి విషమించింది...

కానీ తనకేమైంది?

తనూ నిలబడలేకపోతున్నాడు... కడుపులో పేగులన్నీ చుట్టబెట్టుకపోతున్నట్ట నిపిస్తోంది... కళ్లు మండిపోతున్నాయి. కొంచెం దూరంలో గోడవారగా ఉన్న రిక్షా దగ్గరకు నడిచాడు యాదగిరి. తన బలాన్నంతా ఉపయోగించి మల్లికను అందులో కూర్చోబెట్టి, ఆమె ఒడిలో బాబును పడుకోబెట్టి - రిక్షాను ఆరోగ్యకేంద్రం వైపు పోనిచ్చాడు.

అప్పటికే ఆరోగ్య కేంద్రంలో - తనలాంటి వాళ్లు చాలామంది యమయాతన అనుభవిస్తూ కనిపించారు...

ఆ రోజు కల్లుదుకాణంలో తామంతా తాగిన సారా కల్తీ అయిందట. అందుకే దాన్ని తాగిన వాళ్లందరికీ ప్రాణం మీద కొచ్చిందట. అప్పటికి ఆరుగురో ఏడుగురో చనిపోయారట... ఇంకో పదిమంది పరిస్థితి ఆందోళనకరంగా వుందట...! ఈ విషయాలన్నీ గోలగోలగా అక్కడివాళ్లు చెప్పుకుంటూంటే యాదగిరి విన్నాడు. భయంతో వణికిపోయాడు. తను పోయినా ఫరవాలేదు... మల్లిక మాత్రం బతికితీరాలనుకున్నాడు...

తనకీ మల్లికకీ డాక్టరు ఏవో మందులిచ్చాడు. ఇంజక్షన్లు చేశాడు... కొన్ని గంటలు బరువుగా గడిచాయి. తెల్లవారింది... అయినా మల్లిక కళ్లు తెరవలేదు. ఆమెకు ప్రాణం పోయటానికి డాక్టరు ఎన్నో ప్రయత్నాలు చేశాడు. ఉన్నంతలోనే ఓపిక తెచ్చుకొని - ఊరి చివరనున్న అమ్మవారి గుడికి వెళ్లి-మల్లిక ప్రాణాలు కాపాడమని తను కూడా ప్రార్థనలు చేసొచ్చాడు...

ఆ సాయంత్రానికి మరణించిన వారి సంఖ్య మరింత పెరిగింది... అందులో మల్లిక కూడా చేరిపోయింది!!

ఆరోజు కూడా ఇలాగే భోరున కురిసింది వర్షం...

ఆరునెలలైనా నిండని బాబుకి - తల్లి పోయిందన్న విషయం అర్థం కాలేదు. తాను పోగొట్టుకున్నదేమిటో అర్థం కాలేదు. తాను పోగొట్టుకున్నదేమిటో అర్థం చేసుకున్న యాదగిరి దుఃఖానికి అంతులేదు...

"కల్తీ సారా తాగి నలభైమంది దుర్మరణం"- అంటూ ఆ రోజు పేపర్లన్నీ ప్రముఖంగా ప్రకటించాయి... అందులో మల్లిక కూడావుంది.

"వలచి వలపించుకున్న మల్లిక తనకు దూరమైన తరవాత - తనింక ఎవరికోసం బతకాలి?" అని ప్రశ్నించుకున్నాడు.

"బాబుకోసం బతుకు బావా!"-అంటూ దీనంగా మల్లిక తనవైపు చూసి చెప్పినట్లనిపించింది.

అలా రాజీపడి బతికేస్తున్న రోజుల్లో సుబ్బులు ఎదురైంది. తనకు తోడుగా ఉంటానంది. బుజ్జిగాడికి తల్లినవుతానంది. అందుకే ఆమెను చేరదీశాడు...

"నిద్రపోతున్నావా మావా?" - బుజ్జిగాణ్ణి నిద్రపుచ్చి తన పక్కకువచ్చి కూర్చున్న సుబ్బులు పలకరింపుతో - యాదగిరి మళ్లీ తన ఆలోచనల్లోంచి బయటపడ్డాడు...

"మావా!" - అతని గుండెలపై తలపెట్టుకుని - అప్యాయంగా పలకరించిందామె.

"ఊ?"

"నేనోమాట సెప్తా!" - నెమ్మదిగా అంది.

"ఏమిటీ?"

"పిల్లలు పుట్టకుండా ఆపరేసన్లు సెత్తన్నా రంట మనూళ్లో..."

అమె చెప్పబోయేదేమిటో యాదగిరికి అర్థం కాలేదు...

"మనకి బుజ్జిగాడు ఒక్కడే సాలుమావా!... పిల్లలు పుట్టకుండా నేను ఆపరేసన్ చేయించుకుంటే..." అతని గిరిజాల జుట్టులోకి వేళ్లుపోనిచ్చి తిప్పుతూ చెప్పిందామె వెంటనే.

యాదగిరి ఆ మాటవిని ఉలిక్కిపడ్డాడు.

"ఔను మావా!...నన్నెంతో ప్రేమగా చూసుకున్న నా మొగుడు-ఆరోజు కల్తీసారా తాగి కన్నుమూశాడు..ఏ దిక్కూ లేకుండా ఏకాకిలా మిగిలిపోయిన నన్ను చేరదీశావ్. ప్రెతి బతుక్కీ ఓ పరమార్థం వుంటుందంటారు...నీకు తోడుగా వుంటూ, నీ బిడ్డనే నా బిడ్డగా చూసుకోటంలో పర మార్థం వుందనుకుంటాను. కాదనకు మావా!"-తడికళ్లతో యాదగిరివైపు అర్థింపుగా చూసిందామె.

సుబ్బులు మాటలు విన్న యాదగిరి - తన మరుగుజ్జు సంస్కారానికి సిగ్గుపడ్డాడు...

సుబ్బులుకి తనంటే ఎంతో ప్రేమ...! "కానీ మల్లిక తాలూకు జ్ఞాపకాల్లో పడి కొట్టుకు పోతూ ఆమెకు తాను అన్యాయం చేస్తున్నాడా?" ...

లేదు... చేయకూడదు... చేయలేదు..!

ఆ నిర్ణయానికి వచ్చిన యాదగిరి తృప్తిగా నిట్టూర్చి - అమెను గాఢంగా హృదయానికి హత్తుకున్నాడు...!

(ఈనాడు, ఆదివారం
31-1-1999)